AP 4PG 15 - 3- 2026 SUNDAY qxp_Layout 1 15-03-2026 06:40 AM Page 2



## యాడికిలో ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



యాడికి, మార్చి 14 (అనంత ప్రభ)

యాడికిలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, జనసైనికులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోడి సునీల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడం, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయడం లక్ష్యంగా జనసేన పార్టీని పవన్ కళ్యాణ్ స్థాపించారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించారని అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి విజయంలో జనసేన కీలక పాత్ర పోషించిందని, పోటీ చేసిన స్థానాల్లో 100 శాతం విజయాన్ని సాధించి ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాకీర్ హుస్సేన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అబ్దుల్ రహిమాన్, ప్రధాన కార్యదర్శులు పప్పు వెంకటేష్, గుండ్ల శివ, మధు ఆచారి, నాగభూషణం, సోమ రాజేష్, దస్తగిరి, జనసైనికులు శ్రీనివాసులు, మహేష్, మల్లికార్జున, అల్లా సుధాకర్ పాల్గొన్నారు

## అగాపే వృద్ధాశ్రమంలో బెడ్ సీట్లు పంపిణీ



యాడికి, మార్చి 14 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో వృద్ధులకు, నిరాశ్రయులకు బెడ్ సీట్లు పంపిణీ చేశారు. యాడికి మండలం పచ్చారుమేకలపల్లి గ్రామానికి చెందిన ముత్తలూరు రామకృష్ణ, ఆయన భార్య నారాయణమ్మ, పెద్ద కుమారుడు మధు, కోడలు జ్యోతి, కుమారుడు మనోజ్, కోడలు సాహితి, మనవలు వేదాన్ష్, వియాన్, రుద్ర, మనవరాలు శిశిరతో కూడిన కుటుంబ సభ్యులు కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో తరచుగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలు మరియు సేవాకార్యక్రమాలను చూసి ప్రేరణ పొందిన వారు, తమ వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశంతో ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు బెడ్ సీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు బత్తల ప్రసాద్ మరియు ఆశ్రమంలోని సభ్యులు దాతల కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు

## యాడికి మండలంలో ఉపాధి హామీ పనులపై రేపు ప్రజా వేదిక

యాడికి, మార్చి 14 (అనంత ప్రభ)

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద యాడికి మండలంలో నిర్వహించిన పనులపై 18వ విడత సామాజిక తనిఖీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రేపు ఉదయం 10 గంటలకు యాడికి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యాడికి మండలంలోని 14 గ్రామ పంచాయితీలలో 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఫిబ్రవరి 13 నుంచి మార్చి 15 వరకు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో గుర్తించిన అంశాలను ప్రజా వేదికలో సామాజిక తనిఖీ బృందం అధికారులు వెల్లడించనున్నారు.

అలాగే ఉపాధి హామీ నిధులతో చేపట్టిన గృహ నిర్మాణం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల, సర్వశిక్ష అభియాన్, అటవీ శాఖలకు సంబంధించిన పనుల వివరాలు శాఖల వారీగా వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరారు.

## ఎమ్మెల్యే దగ్గుపాటితో భేటి అయిన ఏపీజేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



అనంతపురం, మార్చి 14 (అనంత ప్రభ)

అనంతపురం ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో ఉద్యోగుల సమస్యలతో పాటు పలు అంశాల గురించి చర్చించారు. ఉద్యోగుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

## చెన్నపురాన్ని పరామర్శించిన బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ



కర్నూలు, మార్చి 14 (అనంత ప్రభ)

జోహారాపురం ప్రాంతంలో జరిగిన సామాజిక కార్యక్రమానికి హాజరైన చెన్నపురం కొద్దిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

14-03-2026 తేదీన కర్నూలు నగరానికి చేరుకున్న మాజీ పార్లమెంట్ సభ్యురాలు, వైఎస్సార్సీపీ నాయకురాలు బుట్టా రేణుక, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ చెన్నపురం స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన చెన్నపురం ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షిస్తూ చెన్నపురానికి ఆత్మీయంగా ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు అభిమానులు పాల్గొన్నారు

## నేడు నూతన ధ్వజస్తంభ, పలు దేవతా విగ్రహాల ప్రతిష్ఠ



యాడికి, మార్చి 14(అనంత ప్రభ)

యాడికి మండలం కమలపాడు పంచాయితీ పరిధిలోని శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం భక్తి శ్రద్ధల మధ్య వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్వామివారికి దాన్యాధివాసం, పంచామృతాభిషేకం, నవగ్రహ ఆవాహిక దేవత జపములు, వేద పారాయణం, మహావిష్ణు సుదర్శన హోమం, మంత్రపుష్పం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గంగవరం ఫ్యామిలీ వారు భోజనాలు ఏర్పాటు చేశారు. నేడు ఆదివారం ఉదయం 7 గంటల నుండి ఆలయంలో ధ్వజస్తంభ పునర్నిర్మాణం, వినాయకుడు, హనుమంతుడు, గరుత్మంతుడు, శంకు చక్రనామాలు, బలిపీఠం, జయ విజయుల విగ్రహాల ప్రతిష్టాపన వంటి పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు విచ్చేసే భక్తులందరికీ అల్పాహారం మరియు విందు భోజనాలు ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. అందరూ తప్పకుండా విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులను ఆహ్వానించారు

## తస్లీమాకు అభినందనలు : ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి



ఆదోని, మార్చి 14 (అనంత ప్రభ)

యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం విభాగంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకం అందుకున్న ఎస్.కే. తస్లీమాను ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్వయంగా ఆమె నివాసానికి వెళ్లి అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక అమ్మాయి అయిన తస్లీమా ఎన్నో కష్టాలు పడుతూ, అనేక రాత్రులు నిద్రను త్యాగం చేసి చదువులో ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ విజయానికి కారణమైన తల్లిదండ్రుల కృషిని కూడా ప్రత్యేకంగా అభినందించారు.

మైనారిటీ సమాజానికి చెందిన బాలికలు విద్యలో ముందుకు రావాలని, ప్రతి కుటుంబం తమ పిల్లలను చదివించాలని ఆకాంక్షించారు. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

అదే విధంగా జర్నలిజం రంగంలో అడుగుపెడుతున్న తస్లీమా తన గళాన్ని మహిళల అభ్యున్నతికి ఉపయోగించడంతో పాటు, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తన కలం ద్వారా పోరాడాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## ఆసియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన దొడ్డి బెలగల్ యువకుడు హుస్సేన్‌కు కర్నూలు జిల్లా అధ్యక్షురాలు ఆది గుడిసె కిష్టమ్మ అభినందనలు




ఆదోని, మార్చి 14 (అనంత ప్రభ)

సౌదీ అరేబియాలో ఇటీవల నిర్వహించిన ఆసియన్ గేమ్స్‌లో కర్నూలు జిల్లా దొడ్డి బెలగల్ గ్రామానికి చెందిన యువకుడు హుస్సేన్ అద్భుత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు. ఆసియన్ గేమ్స్‌లో నిర్వహించిన లాక్రోస్ పోటీలలో అసాధారణ ఆటతీరును ప్రదర్శిస్తూ గోల్డ్ మెడల్ సాధించి సౌదీ అరేబియాతో పాటు తన స్వగ్రామం దొడ్డి బెలగల్ మరియు మొత్తం కర్నూలు జిల్లా పేరును ప్రపంచానికి వినిపించాడు.

గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన యువకుడు కష్టపడి సాధించిన ఈ విజయం నేటి యువతకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని కర్నూలు జిల్లా అధ్యక్షురాలు ఆది గుడిసె కిష్టమ్మ తెలిపారు. సరైన పట్టుదల, లక్ష్యం ఉంటే ప్రపంచ వేదికలపై కూడా విజయాలు సాధించవచ్చని హుస్సేన్ నిరూపించాడని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తే మన యువత ప్రపంచ స్థాయిలో దేశానికి కీర్తి తీసుకురాగలరని ఈ విజయం స్పష్టంగా చెబుతోందని పేర్కొన్నారు. హుస్సేన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

దొడ్డి బెలగల్ గర్వకారణం -- హుస్సేన్ కర్నూలు జిల్లాకు గర్వకారణం -- హుస్సేన్

మన యువతకు ప్రేరణ -- హుస్సేన్

## వైఎస్సార్సీపీ కుట్ర -- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి



ఆదోని, మార్చి 14 (అనంత ప్రభ)

ఆదోనిలో ఎన్డీఏ కూటమిని బలహీనపర్చేందుకు వైఎస్సార్సీపీ కుట్రలు పన్నుతోందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తీవ్రంగా ఆరోపించారు. జనసేన కార్యకర్త సాయికుమార్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలపై గంటలోపే స్పందించి, నేరుగా అతని వద్దకు వెళ్లి పరిస్థితులు తెలుసుకున్నారు. జనసేన కార్యకర్తల కష్టనష్టాలు తెలుసుకుని, వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జనసేన కార్యకర్తలకు ఎటువంటి లోటు లేకుండా చూడటం తన బాధ్యత అని తెలిపారు. అసంతృప్తి ఉన్న ప్రతి కార్యకర్తను వ్యక్తిగతంగా కలుసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలంగా కొనసాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశిస్తున్నారని పేర్కొన్నారు. కూటమిని బలహీనపర్చేందుకు వైఎస్సార్సీపీ చేస్తున్న కుట్రలను కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా తిప్పికొడతారని తెలిపారు. ఆదోనిలో కూటమి ఐక్యంగా ఉన్నంతకాలం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం అసాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు

## రేపటినుండి పదో తరగతి పరీక్షలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి పరీక్షలు కీలకమైన ఘట్టం కావడంతో ఈ సమయంలో తల్లిదండ్రులు ప్రశాంతంగా ఉండి పిల్లలకు ధైర్యం, భరోసా కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలు బాగా చదవాలి, ఎక్కువ మార్కులు సాధించాలి అంటూ పదేపదే ఒత్తిడి చేయకుండా ఉండాలని, పరీక్షలను భయంగా కాకుండా తాము నేర్చుకున్న విషయాలను రాయడానికి ఒక అవకాశంగా భావించేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పిల్లలను పక్కింటి పిల్లలు లేదా బంధువుల పిల్లలతో పోల్చకూడదని, ప్రతి విద్యార్థి సామర్థ్యం వేరు వేరుగా ఉంటుందని గుర్తించాలన్నారు. పరీక్షల సమయంలో బయటి తిండి, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచి ఇంట్లో తయారు చేసిన తాజా ఆహారం, పండ్లు ఇవ్వాలని తెలిపారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగినంత నీరు తాగించేలా చూసుకోవాలని సూచించారు. రాత్రంతా మేల్కొని చదివే అలవాటు కంటే కనీసం 6 నుంచి 7 గంటల నిద్ర ఉండేలా చూడాలని, సరైన నిద్ర లేకపోతే జ్ఞాపకశక్తి తగ్గే అవకాశముందని నిపుణులు హెచ్చరించారు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని, గొడవలు లేకుండా ఉండటం మంచిదన్నారు. వీలైనంత వరకు టీవీలు ఉపయోగించకుండా ఉండాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, తల్లిదండ్రులు కూడా వారి ముందు మొబైల్ ఫోన్లు ఎక్కువగా ఉపయోగించకపోవడం మంచిదన్నారు. అలాగే పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో ఒక రోజు ముందే చూసుకుని రావడం మంచిదని, పరీక్ష రోజు హడావిడి లేకుండా కనీసం 45 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఒక పరీక్ష పూర్తైన తర్వాత దాని గురించి ఎక్కువసేపు చర్చించకుండా తదుపరి పరీక్షపై దృష్టి పెట్టేలా పిల్లలకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. మార్కులు ముఖ్యమే అయినా పిల్లల మానసిక ఆరోగ్యం అంతకంటే ముఖ్యమని గుర్తుంచుకోవాలని తెలిపారు. యాడికి మండలంలోని పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులందరు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అనంత ప్రభ దినపత్రిక వారు ఆల్ ది బెస్ట్ తెలిపారు

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు హైమాక్స్ లైట్లకు 60. వేల రూ వితరణ చేసిన జెసి దివాకర్ రెడ్డి



అనంత, మార్చి 14 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం, తిమ్మనచేరువు గ్రామములో వెలసిన శ్రీ వజ్రగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధి లో భాగంగా కొండపై భక్తుల సౌకర్యం కొరకు హైమస్ విద్యుత్ లైట్లు వేయించడం కొరకు అడ్వాన్స్ గా 60,000-00 రూపాయలను తాడిపత్రి నియోజకవర్గ మాజీ పార్లమెంట్ సభ్యుడు శ్రీ జె. సి. దివాకరరెడ్డి, ప్రస్తుత మునిసిపాల్ చైర్మన్ జె. సి. ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూజారి శ్రీనివాసులు, పూజారి నాగనందయ్య, పూజారి ఆనంద్ నరసింహయ్య, పూజారి ఆనంద్ రాజు, కుటుంబ సభ్యులు మరియు దేవస్థానము అర్చకులు వెంకట రమణయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జె. సి కుటుంబ సభ్యులు శ్రీ వజ్రగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము లో చాలా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ఆర్టీటి టీచర్ బిజెపిలో చేరిక పార్టీ కండువా కప్పిన బిజెపి జిల్లా అధ్యక్షులు



కూడేరు, మార్చి14 (అనంతప్రభ)

కూడేరు మండల పరిధిలోని కొర్రకోడు గ్రామానికి చెందిన ఆర్డిటి టీచర్ శనివారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి సంక్షేమ పథకాలకు ఆకర్షితులనై. బిజెపి పార్టీలోకి చేరడం జరిగిందని. ఇందుకోసం నాకు అవకాశం కల్పించిన కిసాన్ మోర్చా నాయకుడు రామాంజనేయులు మెచ్చి పార్టీలో చేరడం జరిగింది ని విలేకరులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామాంజనేయులు, బిజెపి మండల ఉపాధ్యక్షులు, బి నాగేంద్రతదితరులుపాల్గొన్నారు. మూస నాగరాజు గతంలో ఆ.ర్. డి.టీ టీచర్ గా గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి దళిత కాలనీ ప్రజలకు పని చేయడం జరిగినది అన్నారు. బిజెపి పార్టీలో చేరిన నేను పార్టీ కోసం గ్రామ మండల నియోజకవర్గ పార్టీ నాయకులకు అందుబాటులో ఉండి పార్టీ విస్తరణ కోసం కృషి చేస్తానని త్వరలో మా బంధుమిత్రులు శ్రేయోభిలాషులు బిజెపి పార్టీలోకి చేరుతారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు

## రాయలచెరువులో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమం



యాడికి, మార్చి 14(అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామపంచాయతీలో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి పాల్గొని పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి పన్నుల చెల్లింపు ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులు సమర్థవంతంగా కొనసాగాలంటే ప్రజలు సమయానికి ఇంటి పన్నులు చెల్లించాలని సూచించారు. అధికారులు గ్రామ ప్రజలకు ఇంటి పన్నులు చెల్లించే విధానం గురించి అవగాహన కల్పించారు. పన్నులు చెల్లించడం ద్వారా గ్రామ అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల ఎంపీడీవో వీరరాజు, రాయలచెరువు పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్, బిల్ కలెక్టర్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కలిసిన ఆదోని వైఎస్ఆర్సీపీ పట్టణ ప్రచార అధ్యక్షుడు పరిగెల నారాయణ



ఆదోని, మార్చి 14 (అనంత ప్రభ)

ఆదోని వైఎస్ఆర్సీపీ పట్టణ ప్రచార అధ్యక్షుడు పరిగెల నారాయణ శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత వ్యవహారాలు, భవిష్యత్ కార్యక్రమాలు మరియు రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రజలకు ఆశించిన విధంగా ఫలితాలు ఇవ్వడంలేదని, ఆ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించినట్లు పరిగెల నారాయణ వెల్లడించారు. అలాగే పార్టీపై జరుగుతున్న రాజకీయ కుట్రలను కార్యకర్తలు ఐక్యంగా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ తొలి ప్రాధాన్యత ఇస్తామని, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేసినట్లు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదోని నియోజకవర్గంతో పాటు కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్సీపీ జెండా ఎగరవేయడం ఖాయమని పరిగెల నారాయణ ధీమా వ్యక్తం చేశారు.

ఈ భేటీ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై కూడా చర్చ జరిగినట్లు తెలిపారు